

# సేవే శ్వాస.. అదే ధ్యాస!

## రెండున్నర దశాబ్దాలుగా నిరంతరం నిస్వార్థ సేవలో..

## సత్యంమార్గం సర్వీసెస్ సొసైటీ పేరిట ఎన్నో కార్యక్రమాలు

- వేలాది మందికి ఉచిత శిక్షణ, ఉపాధి అందించిన నేటి మహిళ
- 'మహిళా శక్తి'గా వినుతికెక్కిన సత్యమార్గం ఛైర్మన్ సరిదె శ్రీలక్ష్మి
- అమ్ముల పొదిలో డాక్టరేట్, భారత సేవా రత్న అవార్డులు..

కాపర్తి నరేంద్ర, ఖమ్మం కెరటం న్యూస్

చేతిలో రూపాయి నాణేలు రెండుంటే అందులో ఒకదాన్ని లేనివారికి సాయం చేద్దామనే గొప్ప తత్వం ఆమెది.. మనకు ఉన్నంతలోనే పొరుగు వారికి సేవ చేయాలన్న మహోన్నత గుణమే ఆమెకు పెట్టని కిరీటంగా మారింది.. ఎంచుకున్న బాటలో ఎన్నెన్నో అవరోధాలు ఎదురైనా రెండున్నర దశాబ్దాలుగా ఇదే సూత్రాన్ని తు.చ తప్పకుండా పాటిస్తూ ముందుకు సాగుతున్నారామె.. 2007లో 'సత్యమార్గం సర్వీసెస్ సొసైటీ' పేరుతో ఓ స్వచ్ఛంద సంస్థకు పురుడుపోసి తన సేవా తత్పరతను మరింతగా విస్తృతపరిచారు.. ఎందరో మహిళలకు శిక్షణ ఇచ్చి జీవనయానం చూపారు.. మరెందరికో ఉపాధి మార్గం చూపి దిక్సూచిగా మారారు..

మనం ఇంతలా చర్చించుకుంటున్న ఆ మహిళామణి మరెవరో కాదు..! మన ఖమ్మం ఆడపడచు.. నిజాంపేటకు చెందిన సరిదె శ్రీలక్ష్మి.! సత్యమార్గం సర్వీసెస్ సొసైటీ ఛైర్మన్‌గా అవసరార్డుల సేవలో తరిస్తూ మంచి ప్రఖ్యాతి గడించిన ఆమెను డాక్టరేట్‌తో పాటు మరెన్నో అవార్డులు వరించాయి.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె నిస్వార్ద సేవపై కెరటం న్యూస్ ప్రత్యేక కథనం..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కౌశల్ యోజన, స్కిల్ డెవలప్‌మెంట్, రాజీవ్ యువ కిరణాలు వంటి పథకాల ద్వారా నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న అంశాల్లో శిక్షణ ఇస్తుండటం సత్యమార్గం ప్రత్యేకత. మహిళలకు కుట్టు శిక్షణ, అగర్‌బత్తుల తయారీ, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తుంటారు. ఈ శిక్షణ విషయంలో శ్రీలక్ష్మి కాస్త వినూత్నంగా ఆలోచించి గ్రామాలు, పట్టణాల్లో స్థానికంగా కేంద్రాలు ప్రారంభించేవారు. దీంతో యువత ఉత్సాహంగా నేర్చుకుంటూ ఉపాధి మార్గం పొందుతున్నారు. నిరుద్యోగ యువకులకు లాజిస్టిక్స్‌లో శిక్షణ అందించి విజయవాడ,



ఖమ్మం, వరంగల్ ఎఫ్‌సీఐ గోదాముల్లో ఉపాధి అవకాశాలు చూపారు. ఖమ్మం నగరం సహా చింతకాని, ఖమ్మం రూరల్, కొణిజర్ల తదితర మండలాల్లో 12 కుట్టు శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 4 వేల మందికిపైగా శిక్షణ అందించారు.

## ఎన్నెన్నో.. వినూత్న కార్యక్రమాలెన్నో..

- ఖమ్మం నగరంలోని పంక్షన్ హాల్స్‌లో జరిగే వేడుకల్లో ఆహార పదార్థాలు వృథాగా పడేస్తున్న విషయాన్ని గుర్తించి ఫంక్షన్ హాల్ యజమానులు, వేడుకలు నిర్వహించేవారితో మాట్లాడి వృథాగా పడేసే ఆహారాన్ని సేకరించి ఖమ్మం సహా పరిసర ప్రాంతాల్లోని అనాథ సేవా సదనాల్లోని పిల్లలకు, మానసిక దివ్యాంగులకు అందిస్తున్నారు.
- ఖమ్మం బస్టాండ్‌లో ప్రతేటా వేసవిలో ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ అందించే వారు. అలాగే పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు నిర్వహించారు.
- లాక్‌డౌన్ సమయంలో బోనకల్లు శాంతి నిలయంలోని మానసిక వికలాంగ బాలికల అవస్థలను గమనించి శానిటరీ ప్యాడ్స్‌ను విరివిగా అందించారు.
- నేలకొండపల్లి మండలం బుద్దారం సహా పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్యూరిఫైడ్ వాటర్ పరికరాలను సమకూర్చారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్ వితరణగా అందిస్తున్నారు.
- లాక్‌డౌన్ సమయంలో కూలీలు, వృద్ధులు, దారిలో చిక్కుకున్న వారిని గుర్తించి ఖమ్మంలో సుమారు నెల రోజుల పాటు వారికి ఉచితంగా భోజనాలు పెట్టించారు.
- ఖమ్మం నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని 2019లో జిల్లా అధికార యంత్రాంగం పిలుపునకు స్పందించి జనపనార, వస్త్రంతో చేసిన చేతి సంచులను ఉచితంగా పంపిణీ చేశారు.
- సత్యమార్గం సంస్థ కార్యక్రమాల్లో నిరంతరాయంగా పాల్గొనేందుకు 300 మంది యువతీ, యువకులు సిద్ధంగా ఉంటారు. ఉద్యోగులు, వ్యాపారులు వారి విధులు నిర్వహిస్తూ సత్యమార్గం సేవల్లో సమయం కేటాయిస్తుంటారు. రోగుల అవసరార్థం రక్తదానం చేస్తుంటారు.
- మధిర మండలం దెందుకూరుకు చెందిన ముచ్చింతల వీరభద్రం, లక్ష్మీ నర్సమ్మలకు మధుమేహం రావడంతో ఇద్దరికి చెరొక కాలును తొలగించాల్సి వచ్చింది. వారి ఇబ్బందులపై ఓ దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన శ్రీలక్ష్మి రోటరీ క్లబ్ సహకారంతో లక్ష్మీ నర్సమ్మకు కృత్రిక కాలును అందించారు.
- మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతేటా ఖమ్మం ముస్తఫానగర్‌లోని శ్రీభవాని వృద్ధాశ్రమం వృద్ధులకు చీరెలు, దుప్పట్లను అందించి వారికి ఆప్యాయత పంచుతారు. అలాగే ఎన్నో సందర్భాల్లో ఒంటరి మహిళలు, వృద్ధులకు కూడా నిత్యావసరాలు పంపిణీ చేశారు.
- రసాయనాలు, రంగులతో కూడిన గణపతి విగ్రహాలను తయారు చేస్తే నీరు, వాయు కాలుష్యం ముంచెత్తుతున్న నేపథ్యంలో ప్రతేటా సత్యమార్గం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను అందజేస్తున్నారు.

## శ్రీలక్ష్మికి అవార్డులే మణిమకుటం..

శ్రీలక్ష్మి సేవలకు గుర్తింపుగా కోల్‌కతాలోని స్వామి వివేకానంద సిస్టర్ మార్గరెట్ 2019–20 అవార్డును సిస్టర్ మార్గరెట్ ఫౌండేషన్ ప్రకటించింది. పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ ధన్‌కర్ ఈ పురస్కారాన్ని అందించారు.

- అమెరికాకు చెందిన ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్, సోషల్ సర్వీసెస్, యూత్ డెవలప్‌మెంట్ అంశాల్లో శ్రీలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ డాక్టరేట్‌ను బెంగళూరులో 2020న అందుకున్నారు.
- హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఉమెన్ ఎంపవర్‌మెంట్ 2019 అవార్డును బహూకరించింది.
- శ్రీలక్ష్మి సేవానిరతిని గుర్తించిన ఇండియన్ ఎంపైర్ యూనివర్సిటీ యూనివర్సల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆమెను 'భారత్ సేవా రత్న' అవార్డుకు ఎంపిక చేసింది. ఎక్స్‌లెంట్ ఎచీవ్‌మెంట్ కింద ఈ అరుదైన గౌరవాన్ని ఆ యూనివర్సిటీ కట్టబెట్టింది. బెంగళూరులో బహుమతి ప్రదాన వేడుకకు అనివార్య కారణాల చేత ఆమె హాజరు కాలేకపోవడంతో రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆమెకు ఈ బహుమతిని అందించారు.
- శ్రీలక్ష్మీ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా దిక్సూచి స్వచ్ఛంద సంస్థ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుల్లో భాగంగా 'మహిళా శక్తి' అవార్డును బహూకరించింది.




